రైతులను ఇబ్బంది పెట్టొద్దు

వైసిపి నేత బొత్స

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని రైతులును పదే పదే తమ చుట్టూ తిప్పించుకొని ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు మాజీమంత్రి, ప్రస్తుత శాసనమండలి విపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని చినబంటుపల్లి కోట్ల వెంకటరావు మిల్ ఆవరణలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో బొత్స సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల కష్ట సుఖాలు తెలుసుకున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లుకు సంబంధించి ఫారమ్ 3గురించి మండల తహశీల్దార్ రైతులను పదే పదే తిప్పుతున్నారని పలువురు బొత్స దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ తహశీల్దార్ రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని, రైతులకు కావలసిన పని చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల యోగ క్షేమం మానేసి వారిని ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి ప్రజా ప్రతినిధులు, కార్య కర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు ఉత్తి డ్రామా!

'ఇదిగో పులి.. అదిగో తోక ' అన్న చందంగా ఉంది అపరాల పంటల కొనుగోలులో ప్రభుత్వ అధికారులు తీరు. గత మూడు నెలలుగా అపరాలు కొనుగోలు చేస్తామని రైతులను నమ్మబలికి.. ప్రైవేటు వ్యాపారులకు పరోక్షంగా మేలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అన్నదాతకు అన్యాయం జరుగుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సుమారుగా రెండు నెలలు దాటిపోతున్నా, జిల్లాలో ఒక్క గింజను కూడా కొనలేదంటే... అపరాల కొనుగోలు ఉత్తి డ్రామా గానే కనిపిస్తోందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

- మూడు నెలలుగా రైతులను మభ్య పెడుతున్న అధికారులు
- ప్రయివేటుతో కుమ్మక్కు అయినట్లు అనుమానాలు

రైతు ఇంట్లో నిల్వ చేసిన అపరాల బస్తాలు

ప్రజాశక్తి - జామి

జిల్లాలో ప్రధాన సాగుగా ఉన్న వరి పంట తర్వాత రైతులు ఆపలరాల పంటలైన పెసర, మినుములు, ఉలవలు పండిస్తారు. అందులో భాగంగానే ఏటా జిల్లాలో సుమారుగా 15వేల హెక్టార్లలో అపరాలు సాగవుతాయి. ఇందులో కొంత బాగాన్ని రైతులు విత్తనాలకు, సొంత వినియోగానికి ఉపయోగించు కొని మిగిలిన పంటను అమ్ముకుంటారు. వ్యవసాయ పెట్టుబడులు పెరిగి, పంట అమ్మినా ఖర్చులకు కూడా తిరిగిరాని పరిస్థితి నేడు నెలకొంది. పోనీ ప్రభుత్వమైన గిట్టుబాటు ధర ఇచ్చేలా కొనుగోలు చేస్తుందంటే, అదీ లేదు.

మూడు నెలలుగా తాత్సారం

గత మూడు నెలలుగా అపరాలు కొనుగోలు చేసి రైతులను ఆడుకోవాలని ఎపి రైతు సంఘం పోరాడుతోంది. జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసి, రైతులను ఆదుకోవాలని కోరింది. దీంతో జిల్లాలో జామి (విజినిగిరి), గజపతినగరం, గంట్యాడ, సంతకవిటి, బొబ్బిలి ఇలా ఐదు చోట్ల అపరాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని అట్టహాసంగా ప్రారంభించారు. కానీ రెండు నెలలు కావస్తున్నా జిల్లాలో ఒక్కగింజ కూడా కొనుగోలు చేయలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రయివేటుకు దన్నుగా అధికారులు

అపరాలు పంటలకు ప్రభుత్వం పెసర క్వింటాకు రూ.8,600, మినుములు క్వింటాకు రూ. 7,400 మద్దతు ధర ప్రకటించింది. కొనుగోలు చేయాలంటే రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనుకోవాలని కొంత కాలం, సైట్ ఓపెన్ కాలేదని, ఈ క్రాప్‌లో నమోదు కాలేదని రకరకాల కారణాలతో కొనుగోలులో అధికారులు జాప్యం చేస్తూ వస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేయకుండా డబ్బులు రావడం ఆలస్యం అవుతుందని, ఇన్సూరెన్స్ రాదని ఇలా లేనిపోని సాకులతో రైతులు నేరుగా దళారులను ఆశ్రయించేలా చేశారు. ఇలా రైతుల వద్ద ఉన్న పంటను దళారులు కారు చౌకగా కాజేశారు. ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ కుంటిశాకులు చెబుతూనే ఉందని అన్నదాత వాపోతున్నాడు.

అపరాల కొనుగోలు ఒట్టి మోసం

అపరాలు పంటలకు ప్రభుత్వం మద్దతు దర ప్రకటించడం, కొనుగోలు చేస్తామనడం చెప్పడం ఒట్టి మోసంగా ఉందని రైతులు ఆంటున్నారు. జాయింట్ కలెక్టర్ దృష్టిలో పెట్టినా ఫలితం లేదు. ప్రభుత్వ మద్దతుగా ధర అందేలా కొనుగోలు చేస్తేనే రైతుకు మేలు. కానీ దళారులతో అధికారులు చేతులు కలపడం వల్లే కొనుగోలు చేయడం లేదు.

- బుద్ధరాజు రాంబాబు, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం

నిబంధనలకు విరుద్ధంగా చెయలేం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పని చేయలేం. నాణ్యత పరిశీలనలో అపరాలు లోకల్ మేడ్‌గా తేలింది. కాబట్టి కొనుగోలు సంస్థలు ముందుకు రావడం లేదు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం.

- వెంకటేశ్వర్రావు, మార్క్‌ఫెడ్ డిఎం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్యవేదిక నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి

కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక పిలుపు ● 10న జిల్లా సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను, క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని, 8 గంటల పని దినం, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ , మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని తదితర 17 డిమాండ్లతో ఈ నెల 20 న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టియు నాయకులు కె. అప్పలసూరి అధ్యక్షతన కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఐక్య వేదిక ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో సదస్సులు, కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు జరపాలని, ఈనెల 10న విజయనగరంలో సదస్సు నిర్వహించాలని, మే 16, 17,18 తేదీల్లో జిల్లా , మండల కేంద్రాల్లో ప్రదర్శనలు బైక్ ర్యాలీలు చేయాలని, విజయనగరంలో 18 న బైక్ ర్యాలీ చేయాలని, 20న గ్రామీణ బంధు, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, జిల్లా కేంద్రంలో ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి నుంచి కోట వరకు ప్రదర్శన, కోట వద్ద సభ పెట్టాలని సమావేశం తీర్మానించింది. తొలుత సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ అభివాదం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు బెహరా శంకర్రావు, రైతు సంఘం అధ్యక్షుడు బి. రాంబాబు, ఎఐబిఎస్ఎంఎఫ్ కోఆర్డినేటర్ బివి ప్రసాద్, ఎల్ఐసి యూనియన్ నాయకులు జి. సిద్ధార్థ, పోస్టల్ యూనియన్ నాయకులు జి. గురయ్య, స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ నాయకులు వెంకటరావు, కుమార్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నాయకులు సత్యం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి యుఎస్ రవికుమార్, విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ నాయకులు అప్పలరాజు, ఫేకర్ అండ్ మైన్స్ యూనియన్ నాయకులు ఎ. గౌరినాయుడు, మున్సిపల్ యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, ఆటో యూనియన్ నాయకులు పాపారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టి.వి రమణ, ఎం.వాసా, బి. సూర్యనారాయణ, కార్యదర్శులు ఎ.జగన్ మోహన్ రావు, బి.రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

పరీక్ష కేందాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతుమాధవన్

ప్రశాంతంగా నీట్ పరీక్ష

పరీక్ష కేందాన్ని తనిఖీ చేసిన ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణంలోని నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్. సేతు మాధవన్ ఆదివారం పరిశీలించారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షా ఏర్పాట్లు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రత, బందోబస్తు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట డిఇఓ మాణిక్యం నాయుడు, పరీక్ష కేంద్రం ఇన్‌ఛార్జి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఎపిజిఇఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిజిఇఎ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం కెఎల్‌పురంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం, సంఘ రాష్ట్ర ఎన్నికల అధికారి జి.తిరుపతిరావు, సహాయ ఎన్నికల అధికారి సిహెచ్. జగన్మోహన్ రావు, పర్యవేక్షకులు డి. రాజశేఖర్ రెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా కంది వెంకటరమణ, కార్యదర్శిగా బలివాడ బాల భాస్కరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పువ్వల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.భూషణరావు, కోశాధికారిగా వై.శంకరరావు, ఉపాధ్యక్షులుగా బాలాజీ పాణిగ్రాహి, పి. చిన్నంనాయుడు, డాక్టర్ యుఎ అప్పలరాజు, ఆర్‌వై అనిల్‌కుమార్, ఎన్.వెంకటేశ్వరరావు, లెంక సత్తిబాబు, వై.తేజేశ్వరరావు, కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్సులుగా ఎస్.బంగారాజు, జిఎల్ నాయుడు, ఎమ్. ఆదినారాయణ, పెనుమత్స మేరి, జక్కపు మహేష్, సుధాకర్ పట్నాయక్ ఎన్నికయ్యారు.

సుస్థిర అభివృద్ధి కూటమితోనే సాధ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సుస్థిర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో విలేకర్లతో మాట్లాడారు. అమరావతి పునర్నిర్మాణ సభా కార్యక్రమం దేశ ప్రజలందరు గర్వించెలా విజయవంతంగా జరిగిందని అన్నారు. వైసిపి హయాంలో అమరావతితో పాటు రాష్ట్రఅభివృద్ధిని సర్వనాశనం చేశారని అన్నారు. అమరావతి పునర్నిర్మాణ ప్రారంభ వేడుకను విజయవంతం చేసిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

వంగర ఘటనకు రాజకీయాలు ఆపాదించొద్దు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ ప్రాంతంలో ఏనాడూ దాడులు, రాజకీయ కక్షలు లేవని.. వ్యక్తిగత అంశాలతో జరిగిన ఘటనకు రాజకీయ రంగు అద్దడం సరికాదని డిసిసిబి చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. వంగర మండలంలో కరణం సుదర్శనరావుపై జరిగిన దాడికి రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. వైసిపి మండల అధ్యక్షుడైన సుదర్శనరావుకు కొంతకాలంగా వ్యాపారపరమైన ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని, ఈ విషయమై వంగర పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదైనట్లు తెలుస్తోందని చెప్పారు. ప్రశాంతమైన విజయనగరం జిల్లాలో ఈ తరహా దాడులను తాము కూడా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ వంటివారు అక్కడకు వెళ్లి, ఘటనకు రాజకీయాలను పులమడం చాలా దారుణమన్నారు. ఏదో ఘటనను తీసుకొచ్చి, ఆయన వైకాపా మండల అధ్యక్షుడు కాబట్టి టిడిపి వారే దాడి చేశారని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పుడిప్పుడే అభివద్ధి చెందుతున్న వంగర మండలంలో వివాదాలు పెంచవద్దని హితవు పలికారు. సమావేశంలో టిడిపి నాయకులు బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, గొర్లె శ్రీనివాసరావు, మైలపల్లి పైడిరాజు, నడిపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వలసల నివారణ కోసమని ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగార్చేస్తున్నాయా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. చేసిన పనులకు నెలల తరబడి కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడం.. ఉపాధి నిధులను వేరే పథకాలకు మళ్లించడం.. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించక పోవడం.. రెండు పూటలా పనిచేసినా కూలి గిట్టుబాటు కాకపోవడం.. వంటి చర్యలు అవలంబించడమే అందుకు కారణం. దీంతో ఉపాధి హామీ కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

మండుటెండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



ఉపాధి ఫుల్.. వేతనాలు నిల్

- వేసవి ఎండల్లో నీడ, నీరు కరువు
- పనిముట్లు లేక ఇబ్బందులు
- పనికి తగ్గ వేతనం అందని వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - సంతకవిటి

సంతకవిటి మండలంలోని 10 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. సుమారు 7 వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. రూ.8 కోట్ల వరకు వేతనాల బకాయిలు ఉన్నాయి. మండలంలోని అత్యధిక కుటుంబాలకే ఉపాధి పనులే జీవనాధారం. ప్రభుత్వాలు ఉపాధి కూలీకి రోజుకు రూ.307 వేతనం పెంచామని గొప్పలు చెప్పుకుంటూ ప్రకటించినా, అందులో సగం కూడా రాలేదని కూలీలు గగ్గోలు పెడుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 4 వారాల పాటు వేతనాలు పెండింగ్ ఉన్నాయి. శ్రమకు తగ్గ వేతనం రాకపోవడం, వేతన బకాయిల వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉపాధి హామీ నిధులు దారిమళ్లించి సిసి రోడ్లు, కాలువలు, బిటి రోడ్లు వేస్తున్నారు. కానీ అదే నిధులను కూలీలకు కావలసిన పనిముట్లు, నీరు, నీడ, వేతనాలకు మాత్రం విదల్చడం లేదు. పని ప్రదేశంలో కనీస మౌలిక సదుపాయాలు ఉండవు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులు చెప్పినా... ఆచరణలో ఏమాత్రమూ అమలు కావడంలేదు. కూలీలకు పనికి తగ్గ వేతనం ఇవ్వకపోవడంతో వేతనదారులు పలుమార్లు సంబంధిత అధికారుల వద్దకు చెప్పులు అరిగేలా తిరిగినా, వేతనాలు ఎప్పుడు పడతాయో తమకూ తెలియదంటూ చేతులు దులుపుకుంటున్నారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక, వేసవి ఎండల్లో పనిచేయడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ పనులూ లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం తప్పక వెళ్తున్నామని వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

పనిముట్లు నిల్

2013 సంవత్సరంలోని పార, గునపాలు, తట్టలు వంటి పనిముట్లను ప్రభుత్వం సరఫరా చేసేది. నేటికి 12 ఏళ్లు గడిచినా పనిముట్లు ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. అయితే ఉపాధి పనిముట్లు వేతనదారులే కొనుక్కొని పనికి తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. చివరికి వాటికి అలవెన్స్ కూడా ఇవ్వడం లేదు.

కానరాని పర్యవేక్షణ

ఎం.ఆర్.అగ్రహారంలో ఉపాధి పనులపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఆ గ్రామానికి నేటికీ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదు. ప్రతిరోజూ అధికారుల పర్యవేక్షణ లేకుండా ఉపాధి కూలీలు పనులు చేసుకుంటున్నారు. వేసవి ఎండ తీవ్రత కారణంగా కూలీలకు ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరన్నది ప్రశ్నార్థకమే?. గతంలో ఇదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడంతో ఆయనను తొలగించారు. మళ్లీ చివరికి ఆయనే నిబంధనలకు విరుద్ధంగా తూతూ మంత్రంగా బాధ్యతలు చేపట్టడంతో మళ్లీ అవినీతికి పాల్పడే అవకాశముందని పలువురు కూలీలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

నీరు, నీడ కరువే

ఉపాధి వేతనదారులకు నీడ, నీరు కరువేనని చెప్పొచ్చు. పని ప్రదేశంలో వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మండలంలోని పలు గ్రామాల్లో నీడ, నీరు, మెడికల్ కిట్, ఒఆర్ఎస్ వంటి సదుపాయాలు కల్పన విస్మరించడంతో వేతనదారులకు నానా కష్టాలు పడుతున్నారు.

వేతనాలు లేక ఇబ్బందులు

నాతో పాటు చాలా మందికి ఉపాధి కూలి డబ్బులే జీవనానికి ఆధారం. ఉపాధి పని చేయించుకున్నారు, కానీ వేతనాలు పడకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదు. తక్షణమే అధికారులు స్పందించి వేతనాలు పడేలా చూడాలి.

-డి.సన్యాసిరావు, ఉపాధి కూలీ

పనిప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలి

ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనం ఇవ్వడంలేదు. కనీసం పని ప్రదేశంలో నీరు, నీడ ఉండదు. వేసవి ఎండ తీవ్రతకు చెట్టు నీడే గతి. కూలీలు సొంత డబ్బులతో పనిముట్లు కొనుక్కోవడం వల్ల అదనపు భారం పడుతుంది. ఉపాధికి తగ్గ పనిముట్లు ఇవ్వడం మరిచిపోయారు. తక్షణమే ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి.

- కె.అసిరప్పుడు, సిఐటియు మండల అధ్యక్షులు

సమస్యలను పరిష్కరిస్తాం

త్వరలో పెండింగ్‌లోని ఉన్న 7 వేల మంది ఉపాధి కూలీల సగటు వేతనాలు పడతాయి. ఉపాధి పనుల్లో చేసిన పనికి కొలతల ప్రకారమే కూలి లభిస్తుంది. ఉపాధి పనిముట్లు ప్రభుత్వం నుంచి వస్తే, సరఫరా చేస్తాం.

- ఆర్.హరినాథ్, ఎపిఒ, సంతకవిటి

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సింగల్ డెస్క్ విధానం అమలు చేస్తోందని, తద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు గతం కంటే సులువుగా అనుమతులు పొందేందుకు అవకాశం ఉందని పరిశ్రమల శాఖ ఎడి (అసిసెంట్ డైరెక్టర్) తెలిపారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువత స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. మొత్తం పారిశ్రామిక రంగంలో సుమారు 40వేల మంది ఉద్యోగాలు చేస్తుండగా, ఇందులో అత్యధికంగా 22,544మంది స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్‌లోనే ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది పిఎంఇజిపి పథకం ద్వారా లక్ష్యానికి మించి 241 యూనిట్లు మంజూరు చేశామని తెలిపారు. ఇందులో 116 వరకు గ్రౌండింగ్ అయ్యాయని వివరించారు. ఈవారం తనను కలిసిన ప్రజాశక్తికి పరిశ్రమలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామకృష్ణ ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే....

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

పరిశ్రమల ఏర్పాటుకు సింగల్ డెస్క్ విధానం

- స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌పై యువకులు ఆసక్తి
- పారిశ్రామిక రంగంలో 40వేల ఉద్యోగులు
- లక్ష్యానికి మించి పిఎంఇజిపి యూనిట్లు
- ప్రజాశక్తితో పరిశ్రమల శాఖ ఎడి రామకృష్ణ

జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి?

పరిశ్రమలను మూడు తరహాల్లో చూడాల్సివుంటుంది. ఆ లెక్కన భారీ పరిశ్రమలు 11, మధ్యతరహా పరిశ్రమలు 23 వరకు ఉన్నాయి. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ సుమారు 6,859 ఉన్నాయి. ఇందులో 1237 వరకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏర్పాటయ్యాయి. ఈ తరహా పరిశ్రమల సంఖ్య పెరిగేందుకు జిల్లాలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి.

ఏ తరహా పరిశ్రమల ద్వారా ఎన్ని ఉద్యోగాలు కల్పించారు?

భారీ పరిశ్రమలు రూ.2823.43 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయి. ఇందులో 10,029 మందికి ఉద్యోగులు పనిచేస్తున్నారు. మధ్యతరహా పరిశ్రమలు రూ.639.97 కోట్ల టర్నోవర్, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ రూ.3,428.67కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయి. మధ్య తరహా పరిశ్రమల్లో 7,862 మంది, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌లలో 22,544 మంది చొప్పున ఉపాధి పొందుతున్నారు.

గడిచిన ఏడాదిలో పారిశ్రామిక అభివృద్ధి ఏమిటి?

2024-25లో భారీ, మధ్యతరహా పరిశ్రమలంటూ ఏమి రాలేదు. కానీ, కొత్తగా 1237 స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 2,466 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పిఎంఇజిపి (ప్రధాన మంత్రి ఉపాధి కల్పన ప్రోగ్రాం) కింద జిల్లాకు 62 యూనిట్లు మంజూరు కాగా, వాటికోసం 299 దరఖాస్తులు అందాయి. లక్ష్యానికి మించి 241 యూనిట్లు మంజూరు చేశాము. ఇందులో 116వరకు గ్రౌండింగ్ అయ్యాయి. రూ.233.38 లక్షల వరకు లబ్ధిదారుల ఖాతాల్లో మార్జిన్ మనీ జమయ్యింది. లక్ష్యానికి మించి యూనిట్లు మంజూరు చేయడం వల్ల కొంతమందికి ఇంకా మార్జిన్ మనీ పడలేదు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శాఖా పరమైన సహకారం ఏమిటి?



పరిశ్రమల స్థాపనకు అనుమతి విషయంలో పరిశ్రమల శాఖ అత్యంత కీలకంగా వ్యవహిస్తుంది. పరిశ్రమలు పెట్టదలచుకున్నవారు ముందుగా తమను సంప్రదిస్తే సంబంధిత ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించి, తగిన సూచనలు సలహాలు ఇస్తాం. పరిశ్రమ అనగానే కార్మిక శాఖ, ఫాక్టరీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బ్రాయిల్స్ ఇన్స్‌స్పెక్టర్, విద్యుత్ శాఖ, కమర్షియల్ ట్యాక్స్, అగ్నిమాపక శాఖ తదితర శాఖల అనుమతి తప్పనిసరి. వీటి నుంచి పొందేందుకు గతంలో నెలలపాటు వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సింగిల్ డెస్క్ విధానం అమల్లోకి వచ్చాక అన్ని శాఖల తరపున అనుమతులు మంజూరు చేసేందుకు పరిశ్రమలశాఖ జిఎం నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఎక్కడైనా జాప్యం జరిగితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మన జిల్లాలో ఏయేరంగాలకు చెందిన భారీ పరిశ్రమలు ఉన్నాయి.

మొత్తం 11 భారీ పరిశ్రమల్లో స్టీల్, ఫెర్రోఎల్లాయిస్, ఫార్మా కంపెనీలు ప్రధానమైనవిగా చెప్పుకోవచ్చు. వీటిలో చీపురుపల్లి, ఎస్.కోట, బొబ్బిలి నియోజకవర్గాల్లో ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు ఉన్నాయి. స్టీల్ పరిశ్రమలు కూడా కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో ఉన్నాయి. దాదాపు ఫార్మా కంపెనీలన్నీ పూసపాటిరేగ సముద్ర తీరంలో ఉన్నాయి. ప్యారీ సుగర్స్ లిమిటెడ్ కంపెనీ రేగిడి ఆమదాలవలస మండలం సంకలిలో ఉంది.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

చదువు, జ్ఞానం, సృజనాత్మకతే విద్యార్థుల విజయానికి సోపానాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

చదువు, జ్ఞానం, సృజనాత్మకతే విద్యార్థుల విజయానికి సోపానాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. 12 రోజులుగా జన విజ్ఞాన వేదిక, గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన, వినోద శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. జన విజ్ఞాన వేదిక జిల్లా సహాధ్యక్షులు పి.సత్యంనాయుడు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ముగింపు సభలో కమిషనర్ మాట్లాడారు. ప్రతి విషయంలో కష్టపడేతత్వం ఉన్నతులను చేస్తుందన్నారు. సంపూర్ణ మూర్తిమత్వంతో ఎదగడానికి ప్రణాళికలే కీలకమని చెబుతూ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షులు రమణమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, వాసు విద్యాసంస్థల అధినేత వాసుదేవరావు, పట్టణ ప్రముఖులు బంగార్రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, క్విజ్, సబ్జెక్టులకు సంబంధించిన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బంగారయ్యపేట, చిట్టివానిపాలెం గ్రామాలకు రూ.18 లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నుంచి నిధులు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభించి శరవేగంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గిరిజనులకు ఎమ్మెల్యే దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్ల వెంకటరావు, బూత్ ఇన్‌ఛార్జి ముమ్ములూరి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

గాజులరేగ సంజీవయ్య నగర్‌లో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు వెంకట్ నర్సింగ్ రావు అంబేద్కర్ గారికి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాల మహానాడు పట్టణ అధ్యక్షులు గండిపల్లి సింహాచలం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో 50డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, ఉత్తరాంధ్ర హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శి జామాన శ్రీనివాస్, మాల మహానాడు నాయకుడు గండిపల్లి మహేంద్రబాబు, అంబేద్కర్ రైట్స్ జిల్లా వ్యవస్థాపకులు పాంద్రంకి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

శబ్ద కాలుష్యం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండుగలో శబ్ద కాలుష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పండుగ సందర్భంగా డిజె సౌండ్ బాక్సులు పెట్టి ప్రజలను అసౌకర్యానికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పండుగలో అల్లర్లు, గొడవలు చేయకుండా చూడాలని గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కోనేరు శుభ్రం

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురంలోని పంచాయతీ కార్యాలయం వెనుకనున్న మంచినీటి కోనేటిని యువకులు ఆదివారం శుభ్రపరిచారు. ప్రతి ఆదివారం ఈ కోనేటిని శుభ్రం చేస్తామని యువకులు తెలిపారు. అలాగే కోనేరు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు యువకులు తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యసాయం కనెక్షన్ పనులు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపేస్తున్నట్లు చెప్పారు. మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

తుమ్మికాపల్లి వద్ద ఉన్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. దాతల సహకారంతో అందజేసిన సరుకులను చినరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణంరాజు, బూసాల సన్యాసిరావు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో పలు గ్రామాల్లో వర్షాలు అనుకూలించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తొలకరి నువ్వు పంట ఆశాజనకంగా ఉండటంతో ఆదివారం కలుపు తీసే పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. వేపాడ, వల్లంపూడి, సింగరాయి, ఆతవ, ఆకుల సీతంపేట, గుడివాడ, వీలుపర్తి, వావిలపాడు ఎం.సింగవరం గ్రామాల్లో రైతులు నువ్వు పంటల్లో కలుపు తీసే పనులు చేపడుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - సంతకవిటి



పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరుణ్

సంతకవిటిలోని శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీకాకుళానికి చెందిన లైఫ్ రే ఆస్పత్రి స్త్రీ, ప్రసూతి వైద్యులు పప్పల సౌజన్య, పాకల అరుణ్ కుమార్ గర్భిణులకు, మహిళలకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. 130 మందికి పైగా రోగులకు వైద్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొండవెలగాడలో..

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడలో ప్రాథమిక పాఠశాలలో ఆదివారం దంతులూరి అజయ్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దంతులూరి జోగి జగన్నాథ రామచంద్రరాజు జయంతి సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటుచేశారు. క్వీన్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్యులు సుమారు 500 మందికి గుండె, షుగర్, కంటికి సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉద్యమాల ఊపిరి.. శేషగిరి

నేడు నాలుగో వర్ధంతి సభ ● 'తరుగులేని కీర్తి సిరి' పుస్తకావిష్కరణ

అందరూ గిరి మాస్టారూ.. అని ఆప్యాయంగా పిలిచే కోరెడ్ల శేషగిరి తన 48 ఏళ్ల జీవిత కాలంలో 28 ఏళ్లు ఉద్యమమే ఊపిరిగా జీవించారు. యుటిఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయ, ఉద్యోగుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రజా క్షేత్రంలోనే ఉండేవారు. నిత్యం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను అధ్యయనం చేసి పోరుబాట పట్టారు. ఐక్య ఉద్యమాల రథసారథిగా అందరి మన్ననలు పొందారు.

ప్రజాశక్తి-విజయనగరం

1992 నుండి 94 వరకు ఎస్ఎఫ్ఐ నాయకుడిగా జిల్లాలో విద్యార్థి ఉద్యమ అభివృద్ధికి శేషగిరి కృషి చేశారు. ఎన్‌టి రామారావు రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 1994 డిఎస్‌సిలో అవకతవకలు జరిగాయని డిఎస్‌సిని రద్దు చేశారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయం వెనక్కి తీసుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని విజయనగరం నుండి ఉద్యమం ప్రారంభించారు. ఆ నాయకత్వంలో శేషగిరి, యుటిఎఫ్ నాయకులు డి.రాము ముఖ్యులు. ఆ ఉద్యమాన్ని రాష్ట్రమంతా విస్తరింప జేయడం, పోరాటాలు రూపొందించడంలో వీరు ప్రముఖ పాత్ర నిర్వహించారు. రెండేళ్ళ ఉధృత పోరాటాల అనంతరం ఎన్‌టి రామారావు ప్రభుత్వం నిర్ణయం మార్చుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించింది.

జిల్లాలో యుటిఎఫ్ విస్తరణలో ముఖ్య పాత్రధారి

ఆ పోరాటం ఘనవిజయం సాధించడంలో ముఖ్యభూమిక పోషించిన శేషగిరి జిల్లా వ్యాప్తంగా నియమితులైన ఆ బ్యాచి ఉపాధ్యాయులను యుటిఎఫ్‌లో సభ్యులుగా చేర్పించి సంఘటిత పర్చడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. అందువల్లే విజయనగరం డివిజన్‌లో కొద్ది మండలాలకు పరిమితమై ఉన్న యుటిఎఫ్ ఒకేసారి జిల్లాలో అన్ని మండలాలకు, మున్సిపాలిటీలకు విస్తరించింది. అప్పటి నుండి జిల్లాలో సంఘాన్ని బలపర్చడంలో శేషగిరి ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. శేషగిరి నిరంతర అధ్యయన శీలి. సిద్ధాంత అధ్యయనమే గాక స్థానిక సమస్యలపై అధ్యయనం చేసేవారు. ఉపాధ్యాయులు, విద్యా సంబంధిత సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ చేశారు. అందువలనే అతనికి సిద్ధాంతం మీదే కాదు స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉండేది. అన్ని యాజమాన్యాల్లో ఉపాధ్యాయులకు శేషగిరి ఆప్తుడయ్యారు. అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడయ్యారు.

సైద్ధాంతిక కృషీవలుడు

విధానపరంగా ప్రపంచం, దేశం, రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న మార్పులను సైద్ధాంతిక, రాజకీయ కోణంలో దూరదృష్టి నుంచి అర్థం చేసుకోవడం శేషగిరి ప్రత్యేకత. వాటిపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగించేవారు. అందుకు జిల్లాలో టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ స్టడీసర్కిల్‌ను రెగ్యులర్‌గా నిర్వహించారు. తరువాత గురజాడ అధ్యయన వేదిక పేరుతో ఆ కృషిని నిరంతరాయంగా కొనసాగించారు. ఆర్థిక రాజకీయ సామాజిక పరిణామాలపై సదస్సులు, సెమినార్లు నిర్వహించేవారు. అనుబంధాలతో నిమిత్తం లేకుండా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని కార్యాచరణకు పూనుకొనేవారు. ప్రదర్శనలు, బహిరంగ సభలకు వందలు, వేలాది మందిని సమీకరించేవారు. అందువలనే జిల్లాలో ఐక్య ఉద్యమాల రథసారథిగా శేషగిరి అందరి మన్ననలు పొందారు.

నిబద్ధత , ఉద్యమ స్ఫూర్తి గల నాయకుడు

జిల్లాలో అక్షరాస్యతా ఉద్యమంలో శేషగిరి పని చేశారు. శేషగిరి శాస్త్రీయ దృక్పథం గల వ్యక్తి. యుటిఎఫ్ బాధ్యతల్లో ఉన్నా జనవిజ్ఞాన వేదిక లో చురుకైన పాత్ర నిర్వహించారు. శాస్త్ర కళా జాత, అక్షర కళా జాత నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు. జిల్లాలో సాహితీ స్రవంతి ప్రారంభానికి కవులను, రచయితలను సమీకరించి విజయనగరంలో సాహితీ స్రవంతి ప్రారంభ సభ నిర్వహణకు చాలా కృషి చేశారు. శేషగిరి గొప్ప వాదనాపటిమ గలిగినవారు. ఉద్యమం పట్ల నిబద్ధత కలిగి ఎదుటివారి వాదనలో పొరపాట్లను పూర్వపక్షం చేసి తన వాదనలో విషయం అర్థమయ్యేలా చెప్పేవారు. ఉద్యమాభివృద్ధి తప్ప వ్యక్తిగత కీర్తీ ఖండూతి లేనివారు. అందుకే ఆయన మరణించి నాలుగేళ్లయినా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆయనను మరవలేకున్నారు.

విధానాలపై పోరాట యోధుడు

నాడు సిపిఎస్, నేడు నూతన విద్యావిధానంపై లోతైన అధ్యయనం చేసి అంతే పట్టుదలగా ఉపాధ్యాయులను, విద్యార్థులను విజయనగరం జిల్లాలో కదిలించడంలో శేషగిరి ముఖ్య పాత్ర పోషించారు. సిపిఎస్ ముప్పును గుర్తించిన తొలి రోజుల్లో విజయనగరం జిల్లాలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారు. అలాగే మోడీ 2020 నూతన విద్యా విధానాన్ని సమూలంగా అర్థం చేసుకొని దానిపై ప్రతి హైస్కూల్ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, పెద్ద ఎత్తున అన్ని సంఘాల నాయకత్వాన్ని ఒప్పించి పెద్ద పెద్ద ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. మోడీ ప్రభుత్వం సర్వ రంగాల ప్రైవేటీరణపై వెలువడుతున్న వ్యతిరేకతను కూడగట్టి అందరినీ ఒకచోటకు చేర్చి సంఘటితం చేయాలనే ఉద్దేశంతో 18-4-2021న విజయనగరంలో శేషగిరి నిర్వహించిన సభ అతని జీవితంలో చివరిది.

నేడు శేషగిరి వర్ధంతి సభ

యుటిఎఫ్ నాయకులు కోరెడ్ల శేషగిరి నాలుగవ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం 10గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన సభ జరుగనుంది. ఈ సందర్భంగా ఆయన రాసిన వ్యాసాలతో ముద్రించిన 'తరుగులేని కీర్తి సిరి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా' భారత ఫెడరలిజం సవాళ్లు' అనే అంశంపై శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేయనున్నారు. అతిథులుగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు హాజరు కానున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరై ఈ సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు కోరారు.

నాణ్యత డొల్ల

ఎక్కడికక్కడే జారిపోతున్న మారిక రోడ్డు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం మారికకు వేస్తున్న తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎక్కడికక్కడే రోడ్డు పెచ్చులూడిపోతుంది. దీనికి అధికారుల పర్యవేక్షణా లోపమే ప్రధాన కారణమని గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దశాబ్దాలుగా మారిక గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. సిపిఎం ఆధ్వర్యాన గిరిజనుల పోరాట ఫలితంగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నత్తనడకన ఈ రహదారి పనులు చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రహదారి ఎక్కడికక్కడే కోతకు గురైంది.

రాళ్లు తేలిపోతున్న రోడ్డు

కోతకు గురైన రోడ్డు

ఇప్పటికైనా రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను అధికారులు పర్యవేక్షించాలని గిరిజనులు కోరుతున్నారు.

మహనీయుల ఆశయాలను సాధించాలి

డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి ● ఘనంగా భగీరథ మహర్షి జయంతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భగీరథ మహర్షి జయంతి మహోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి ముందుగా భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆరఒ మాట్లాడుతూ, మహనీయుల త్యాగాలను సాధించడమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుని, స్ఫూర్తిని పొందేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి కె.జ్యోతిశ్రీ, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి వీటి రామారావు, గృహ నిర్మాణ శాఖాధికారి మురళి, సహాయ మున్సిపల్ కమిషనర్ అప్పలరాజు, ఎబిసిడబ్ల్యుఒ యశోధనారావు, వసతిగృహ సంక్షేమాధికారులు, సిబ్బంది, వివిధ బిసి సంఘాల నాయకులు విజయలక్ష్మి, సదనపల్లి రాము, సదనపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

నైపుణ్య శిక్షణకు 103 మంది ఎంపిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో ఆదివారం నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాల మేళాలో 200 మంది యువతీ యువకులు పాల్గొనగా, 103 మందిని వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ కోసం ఎంపిక చేశారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాసానికి విద్యే బాట అని, యువత నైపుణ్యాన్ని అభివృద్ధి చేస్తేనే సుస్థిర భవిష్యత్తు సాధ్యమని తెలిపారు. యువత ఉద్యోగావకాశాలు పొందాలంటే, ఇటువంటి శిక్షణలు కీలకమని, టిడిపి ప్రభుత్వం ఉద్యోగ కల్పనకు కట్టుబడి ఉందని సీడప్ వంటి సంస్థల సహకారంతో ఇంకా ఎక్కువ శిక్షణ శిబిరాలు, మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. నైపుణ్యం ఉన్న ప్రతి యువకుడికి దేశంలో మంచి స్థానం ఉంటుందని. మీరు అవకాశాలను ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని ప్రథమ స్థానంలో నిలిచిన కొట్టాం గ్రామానికి చెందిన తెరపల్లి ఈశ్వర రావు కుమార్తె తెరపల్లి రోషిణి సన్మానించి, జ్ఞాపికతో పాటు రూ.5,000 ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఆమె ఇంటర్‌లో చదువుకునేందుకు ఏ కార్పొరేట్ కళాశాలలో చేరినా 50శాతం ఫీజు భరించనున్నట్లు హామీ ఇచ్చారు.

పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి రోషిణిని సన్మానిస్తున్న గొంప క్రిష్ణ

టిడిపి నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతరం పట్టణంలోని టిడిపి సీనియర్ నాయకులు చిప్పాడ రమణాజీ దిన ఖర్మ కార్యక్రమానికి హాజరైన గొంప క్రిష్ణ ఆ కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జాబ్స్ డిస్టిక్ మేనేజర్ కళ్యాణి అల్లా, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవి కుమార్, జుత్తాడ రామసత్యం, గుమ్మడి వానిభారతి, ఆడారి రమేష్, వివేకానంద కాలేజీ కరెస్పాండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-భోగాపురం

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వారం రోజులుగా సిహెచ్‌ఒలు నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ కల్పించకపోవడం దారుణమని పేర్కొన్నారు. వీరికి ఇస్తున్న వేతనాలకు 23 శాతం జీతాలు పెంచాలనడం సబబేనని చెప్పారు. గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకొని వెల్‌నెస్ కేంద్రాలు నిర్వహిస్తున్నా ప్రతినెలా అద్దె కూడా చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి,రామభద్రపురం

రామభద్రపురం మండల కేంద్రంలో సాలూరు బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక మహిళ మృతిచెందింది. ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం... మండల కేంద్రంలో శ్రీరామనగర్ కాలనీకి చెందిన చలమల సత్యవతి (65) కూరగాయల వ్యాపారం నిమిత్తం ఆదివారం తెల్లవారుజామున మార్కెట్‌కు వెళ్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సాలూరు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం బాడంగి సిహెచ్‌సికి తరలించారు. ఆమె భర్త చలముల చిన్నా ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రమణ కేసు నమోదు చేశారు.

మృతిచెందిన సత్యవతి

స్వాధీనం చేసుకున్న గంజాయి, వ్యానుతో పోలీసులు

ఫర్నీచర్ మాటున గంజాయి రవాణా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం జిల్లా శృంగవరపుకోట పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద ఆటోలో తరలిస్తున్న 20కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారంతో ఆదివారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక వాహనంలో ఫర్నీచర్ మాటున ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్న 20 కేజీల గంజాయిని సిఐ ఎన్.నారాయణమూర్తి ఆధ్వర్యాన పట్టుకున్నారు. వాహన డ్రైవర్ తమిళనాడుకు చెందిన మరియఅరుళ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం

రక్తదానం సామాజిక బాధ్యత అని మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం రక్తదాన విభాగం అధ్యక్షులు మహేష్ అన్నారు. ఆదివారం ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకులో ఇటీవల జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన వారికి నివాళులర్పించి రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ ప్లాస్టిక్ అండ్ కాస్మోటిక్ వైద్య నిపుణులు డాక్టర్ ఎం.శ్రావణి మాట్లాడుతూ వేసవిలో రక్త నిల్వల కొరత ఉంటుందని, రక్తమందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని.. ఇటువంటి తరుణంలో మేమున్నాం సంస్థ రక్తదాన శిబిరాన్ని చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది యువకులు రక్తదానం చేసారు. కార్యక్రమంలో మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మౌళి,సూరిబాబు,లతా, మూర్తి,చంద్రశేఖర్ పాల్గొన్నారు

వృద్ధాశ్రమానికి పరికరాలు, వస్త్రాలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

వృద్ధురాలికి బట్టలు అందజేస్తున్న రమాదేవి, వెంకటరమణమూర్తి

నగరం లోని ప్రదీప్‌నగర్‌లో వెంకటసాయి వృద్ధాశ్రమానికి సెయింట్ జోసఫ్ స్కూల్ 1998 పదో తరగతి విద్యార్థులు 5 ఎయిర్ కూలర్లు, 2 వాటర్ ఫిల్టర్లు , 20 దుప్పట్లు , నైటీలు, టవల్స్, లుంగీలు అందజేశారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి వెంకటేశ్వరరావు బి. రమాదేవి, వెంకటరమణ మూర్తి రాజు చేతులు మీదుగా వితరణ అందజేశారు. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 1998 బ్యాచ్ విద్యార్థులు లు దేశ విదేశాలలో మంచి ఉద్యోగాలో స్థిరపడి ఇలా వయోవృద్ధుల కోసం వస్తువులు వితరణ చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు కె. ఆంజినేయులు, కె. వెంకటేశ్వరరావు, వై. శివ, కె.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 20ను సవరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థలో భవన నిర్మాణం అనుమతులపై తీసుకొచ్చిన జీవో 20ను మార్పులు చేసే విధంగా సవరించాలని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఐ.ఆదినారాయణ, ఎ.శ్రీనివాసరావు. కోశాధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 300 చదరపు మీటర్ల లోపు స్థలాలకు సంబంధించి భవన నిర్మాణ అనుమతుల విషయంలో ప్లింత్ లెవెల్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు బాధ్యతలు నుండి లైసెన్స్‌డ్ సర్వేయర్ల (ఎల్ టి పి) ను తొలగించి, ఆ బాధ్యతలను టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలకు అప్పగించాలని, చట్ట పరిమితులకు లోబడి మరింత సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌ను అనుమతించాలని కోరారు. దీనివల్ల దరఖాస్తుదారులు వాస్తు కోసం చేసే డీవియేషన్‌లు తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అంతిమ లక్ష్యం చిన్న భవన నిర్మాణ దారులు కూడా నిబంధనలు అతిక్రమించకుండా నిర్మాణాలు చేయటమే కాబట్టి ప్రతి పురపాలక సంఘాల్లో ఉన్న వార్డు ప్లానింగ్ సెక్రెటరీల సర్వీసులు సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్లాన్ అనుమతి కోసం సమర్పించే దస్తావేజులలో కోర్టుల్లో ఉన్న న్యాయపరమైన వివాదాలు అర్జీదారుడు మభ్యపరచి అనుమతి పొందిన యెడల అందుకు లైసెన్సుడు సర్వేయర్లని బాధ్యులు చేయరాదన్నారు. భవన నిర్మాణ దారులకు ఈ నూతన జీవో గురించి ఎంత వివరించినా వారు అనధికారంగా కట్టుకోవడానికి ప్రత్యమ్నాయ మార్గాలవైపు మళ్లుతున్నారని తెలిపారు. కావున సవరణలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, తగిన చర్యలు చేపట్టాలని కోరారు.